సమాచారం

14మందికి కోవిడ్ పరీక్షలు

అందరికీ నెగిటీవ్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 14 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా అందరికి నెగిటీవ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఎవరికైనా రోజుల తరబడి జ్వర లక్షణాలు, దగ్గు, గొంతునొప్పి ఉంటే వెంటనే కోవిడ్ పరీక్ష చేయించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఆర్ట్ కాంపిటీషన్‌లో పాల్గొన్న విద్యార్థితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సూరారం డివిజన్ మార్కండేయనగర్‌లోని సాధన హైస్కూల్‌లో బుధవారం 'పరీక్ష పే చర్చ'లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో 'ఆర్ట్ కాంపిటీషన్'ను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్యఅతిథిగా శ్రీశైలం గౌడ్ హాజరై బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27న ప్రధాని నరేంద్ర మోడీ 'పరీక్షా పే చర్చ'ద్వారా వర్చువల్‌గా ప్రసంగిస్తారన్నారు. దానిలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ప్రవీణ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్‌రెడ్డి, భావిగడ్డ రవి, ఎగ్జామ్ వారియర్స్ నిర్వహణ కమిటీ సభ్యులు దయాకర్, డివిజన్ అధ్యక్షులు దుర్యోధనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



శ్రీవరసిద్ధి వినాయకుడికి అభిషేకం చేస్తున్న కార్పొరేటర్ రావుల శేషగిరి

సుభాష్‌నగర్: రావినారాయణరెడ్డినగర్–ఈస్ట్‌లో బుధవారం శ్రీవరసిద్ధి వినాయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వినాయకుడికి అభిషేకం చేశారు. ఈ పూజలో కార్పొరేటర్ రావుల శేషగిరి, నారాయణ, రమేష్, సోమేష్, మురళీకృష్ణారెడ్డి, ల్యాబ్ శ్రీను, టెంపుల్ శ్రీను, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికే పెద్దపీట

ఓల్డ్‌బోయిన్‌పల్లి: నియోజకవర్గ అభివృద్ధికే పెద్దపీట వేశామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ ఎల్‌బీనగర్‌లో రూ.21.40 లక్షలలు, ఎస్సీబస్తీలో రూ.20.40 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. హస్మత్‌పేట బోయిన్‌చెరువు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. చెరువును సుందరీకరించి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని సోని కాంప్లెక్స్‌లో ఎస్.సంజీవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, బ్లౌజ్ డిజైన్స్, జ్యూట్ బ్యాగ్ తయారీ, మగ్గం వర్కు, ఎంఎస్ ఆఫీస్‌లో స్వయం ఉపాధి కోర్సులకు ఉచిత శిక్షణకు మహిళలు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌లు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఫొటో, ఆధార్‌కార్డుతో పై తెలిపిన కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 4.30గంటలలోపు సంప్రదించాలని కోరారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలకు ఫోన్ నం.93961 61936.

జీరో బిల్లుల వసూళ్లలో దూకుడు

ఏ నెలకు ఆ నెల బిల్లులు కట్టాల్సిందే..

- జలమండలి అధికారుల చర్యలతో పెరిగిన ఆదాయం
- బిల్లులు చెల్లించకపోతే కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరిక



జీడిమెట్ల సెక్షన్ పరిధిలో నీటి బిల్లులు వసూలు చేస్తున్న జీఎం శ్రీధర్‌రెడ్డి, సెక్షన్ మేనేజర్ రాజు

చింతల్: జీరో బిల్లుల (ఏ నెలకు ఆ నెల) వసూళ్ల విషయంలో జలమండలి అధికారులు దూకుడు పెంచారు. మూడు నెలలుగా జలమండలి అధికారులు ఇదే పనిలో ఉన్నారు. ఇప్పటి వరకు ప్రతి సెక్షన్‌లో 80శాతానికి పైగా జీరో బిల్లులు వసూలయ్యేలా చర్యలు తీసుకున్నట్లు జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ప్రతి నెల జలమండలి ఆదాయం కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో పెరుగుతూ వస్తోందని తెలిపారు. 2021వ సంవత్సరంలో 20వేల లీటర్ల ఉచిత నీటి పథకం ప్రవేశపెట్టిన తర్వాత అధికారులు జీరో బిల్లుల వసూళ్లను ముమ్మరం చేశారు. 2022 డిసెంబర్ నాటికి 80,483 కనెక్షన్లు పెరిగాయి.కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో మూడు సబ్ డివిజన్లలో మొత్తం పది సెక్షన్ల ఉన్నాయి. ఒక్కో సెక్షన్ కింద డీజీఎంతో పాటు సెక్షన్ మేనేజర్లు అదేవిధంగా వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, డివిజన్ కార్యాలయంలో పనిచేసే సిబ్బందిని సైతం బిల్లుల వసూళ్లకు వినియోగించడంతో సకాలంలో బిల్లులు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆధార్ అనుసంధానం కాకుంటే త్రిపుల్ టైమ్ బిల్లు

ఇప్పటి వరకు డివిజన్ పరిధిలోని కొంతమంది వినియోగదారులు ఆధార్ నంబర్లను నీటి కనెక్షన్‌కు అనుసంధానం చేసుకోలేదని అధికారులు పేర్కొంటున్నారు. అనుసంధానం చేసుకోలేని వారు 20వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకానికి అర్హులుకాదన్నారు. అలాంటి వినియోగదారుల నుంచి త్రిపుల్ టైమ్ బిల్లులు వసూలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆధార్ అనుసంధానం చేసుకోనంత వరకు త్రిపుల్ టైమ్ బిల్లులు వసూలు చేస్తామని స్పష్టం చేశారు. బిల్లు చెల్లించకపోతే కనెక్షన్లను తొలగించేందుకు ఉన్నతాధికారులు నివేదిస్తామని తెలిపారు. అదే విధంగా పాత భవనాలకు సైతం 2012 కంటే ముందు నిర్మించిన వారు జీహెచ్ఎంసీ నుంచి అనుమతి పత్రం దాఖలు చేసినట్లయితే వారికి త్రిపుల్ టైమ్ నుంచి సింగిల్ టైమ్‌కు బిల్లును మార్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు నిర్మించే భవనాలకు ఆక్యుపెన్సీ తప్పనిసరి అని చెబుతున్నారు.

సీవరేజి బిల్లులు చెల్లించాల్సిందే..

కొంతమంది భవన యజమానులు తమకు నీటి కనెక్షన్ అవసరం లేదని తమకు ఇళ్లల్లో ప్రత్యేకంగా తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసుకున్నామని చెబుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. వారు అక్రమంగా తమ భవనాల నుంచి వచ్చే సీవరేజి పైపులైను బయటకి కలుపుకుంటున్నారని దీంతో జలమండలికి భారీగా ఆదాయం గండి పడుతోందని చెబుతున్నారు. దీనిపై జలమండలి ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ఓ రెవెన్యూ అధికారిని స్థానికంగా నియమించి బిల్లులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

◆ వీరు సీవరేజి కోసం నీటి బిల్లులో 30శాతం మేర జలమండలికి చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కానీ సదరు యజమానులు ఏళ్ల తరబడి సీవరేజి బిల్లులను చెల్లించకుండా మురుగు పారుదల వ్యవస్థను ఉపయోగించుకుంటూ వస్తున్నారని తెలిపారు. అలాంటి ఇళ్లపై జలమండలి రెవెన్యూ విభాగం అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ వస్తున్నారు. ఇప్పటికే సదరు భవన యజమానులకు రెండు, మూడు పర్యాయాలు నోటీసులు అందజేశామని స్పందించని వారి సీవరేజీ కనెక్షన్ తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

400 నోటీసులు... 70 కనెక్షన్ల తొలగింపు

సుమారు 400 మందికి పైగా నోటీసులు అందించగా 60 నుంచి 70 వరకు సీవరేజి కనెక్షన్లు తొలగించామన్నారు. దీంతో వారు కనెక్షన్ కోసం దరఖాస్తులు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. నీటి బిల్లులు చెల్లించకపోయినా... సీవరేజి బిల్లులు చెల్లించకపోయినా వారి పైప్‌లైన్లను తప్పనిసరిగా తొలగిస్తామని చెబుతున్నారు. ప్రతి ఒక్క వినియోగదారుడు నీటి బిల్లులతో పాటు సీవరేజి బిల్లును సైతం చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోండి...



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత 20వేల లీటర్ల పథకానికి అర్హులుగా ఉండేందుకు ప్రతి వినియోగదారుడు ఆధార్‌ను తాగునీటి కనెక్షన్‌కు అనుసంధానం చేసుకోవాలి. అప్పుడే 20వేల లీటర్ల ఉచిత పథకం వర్తిస్తుంది. లేకుంటే త్రిపుల్ టైమ్ బిల్లులు చెల్లించాలి. బిల్లులు చెల్లించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. భారీ భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ తప్పనిసరిగా అనుసంధానం చేసుకోవాలి. కొంతమంది వినియోగదారులు ఇప్పటికీ మీటర్లు బిగించుకోకుండా నీళ్లను రోడ్లపై వదులుతున్నారు. అటువంటి వారిని నిఘా బృందాలు గుర్తించి జరిమానాలు విధిస్తున్నాయి. నల్లాలు లేకుండా పైపులను రోడ్లపై వదిలేసే వారికి భారీ జరిమానాలు విధిస్తున్నాం.

– శ్రీధర్‌రెడ్డి, జీఎం, కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయం

సంక్షేమ సంఘాలు అభివృద్ధికి వారధులు

ఎమ్మెల్యే వివేకానంద్



మాస్టర్స్ అథ్లెటిక్స్ జిల్లా ప్రెసిడెంట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు అభివృద్ధికి వారధులని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట షిర్డీ హిల్స్ బ్లాక్-ఏ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు బుధవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే వారిని సత్కరించి మాట్లాడారు. కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు క్రియాశీలకంగా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా ఐక్యతతో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షుడు రుద్ర అశోక్, నాయకులు మారయ్య, కాలనీ ప్రెసిడెంట్ సీహెచ్ దాసు, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్, క్యాషియర్ శేషు తదితరులు పాల్గొన్నారు.

◆ ఈనెల 21, 22 తేదీల్లో మెదక్‌లో జరిగిన 9వ నేషనల్ అథ్లెటిక్స్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ చాంపియన్‌షిప్‌లో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా నుంచి 150 మంది పాల్గొనగా మెన్, ఉమెన్ మార్చ్‌ఫాస్ట్‌లో మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం మేడ్చల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ రత్నకుమార్ తదితరులు ఉన్నారు.

కృష్ణాజలాల వాటా, రాష్ట్ర విభజన హామీలపై దీక్ష

- టీజేఎస్ రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి అశోక్
- ఢిల్లీలో కేసీఆర్ నిరంకుశ పాలనను ఎండగడతాం



చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ జన సమితి నాయకులు

కుత్బుల్లాపూర్: రాష్ట్ర విభజన చట్టంలో హామీల సాధన కోసం.. కృష్ణాజలాల్లో న్యాయమైన వాటా.. కేసీఆర్ మోసపూరిత రాజకీయాలను ఎండగట్టేందుకు ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి అశోక్ అన్నారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్‌లో బుధవారం ఆయన ఛలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 30వ తేదీన జంతర్ మంతర్ వద్ద కృష్ణా జలాల వాటా, రాష్ట్ర విభజన హామీలపై దీక్ష కొనసాగుతుందన్నారు. 31న కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో కేసీఆర్ తొమిదేళ్ల పాలన, అభివృద్ధి వాస్తవాలపై సెమినార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సెమినార్‌ను పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించారు..

1200 మంది తెలంగాణ కోసం ఆత్మబలిదానం చేస్తే కేవలం ఒకే కుటుంబం నేడు అధికారం చెలాయిస్తోందన్నారు. మూడు లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించారని ఆరోపించారు. లక్షల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కేవలం కమీషన్ల కోసమే చేపట్టి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఏ తెలంగాణ రాష్ట్రం కోసమైతే పోరాటం చేశామో ఆ తెలంగాణ పదాన్ని అవహేళన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పార్టీ పేరు నుంచి తెలంగాణ పదాన్ని తొలగించి భారత రాష్ట్ర సమితిగా మార్చి దేశాన్ని ఉద్ధరిస్తానని అంటున్న కేసీఆర్ కుయుక్తులను ఆయన నిరంకుశ పాలనను దేశ రాజధాని వేదికగా ఎండగడతామని తెలిపారు. తెలంగాణ జనసమితి యువజన విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎర్ర వీరన్న, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్, ప్రధాన కార్యదర్శి మణి, స్థానిక యువకులు నాగేందర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన నాలా పనులు

- హామీ ఇచ్చి మరిచిన అధికారులు



గోదావరి హోమ్స్ పార్క్‌లైన్ రోడ్డులో నత్తనడకన సాగుతున్న నాలా పనులు

సుభాష్‌నగర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని పార్కులైన్‌లో ఎస్ఎన్‌డీపీ పనుల్లో భాగంగా వెన్నెలగడ్డలోని ఎన్నా చెరువు నుంచి గోదారి హోమ్స్ మీదుగా చేపడుతున్న నాలా పనులు నత్తనడకన సాగుతున్నాయి. 220 మీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పుతో 2022 అక్టోబరు 28న ప్రారంభమైన నాలా పనులు 45రోజులు కావస్తున్నా పూర్తి కాకపోవడంతో ఆ రోడ్డులో ఉన్న 200 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇప్పటి వరకు 25 మీటర్ల నాలా పనులు మాత్రమే పూర్తయ్యాయని స్థానికులు పేర్కొంటున్నారు. నాలా స్లాబ్ నాసిరకంగా చేపట్టడంతో అప్పుడే పగుళ్లు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ విషయమై డిసెంబర్ 2న సాక్షి వెలుగులోకి తీసుకురాగా అధికారులు వచ్చి పనులను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చి మరచిపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కంటి సమస్యలను దూరం చేసేందుకే కంటి వెలుగు



క్రాంతినగర్ కమిటీహాల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శిస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి

నిజాంపేట్: రాష్ట్ర ప్రభుత్వం పేదల కంటి సమస్యలను దూరం చేసేందుకు కంటి వెలుగును ప్రవేశపెట్టిందని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం క్రాంతినగర్ కమిటీహాలులో కొనసాగుతున్న కంటి వెలుగు కేంద్రాన్ని కార్పొరేటర్ విజయలక్ష్మితో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కంటి శిబిరం జరుగుతున్న తీరును పరిశీలించిన మేయర్ ఏమైనా సదుపాయాల లోపాలున్నాయా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేయాలని సూచించారు. 1వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడ కొండమ నాయుడు, వైద్యులు దీపిక, రమేష్, సిబ్బంది ఉన్నారు.

◆ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని చికెన్ దుకాణాల యజమానులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని మేయర్ వారికి హామీ ఇచ్చారు. కార్పొరేటర్లు సురేష్‌రెడ్డి, బాలాజీనాయక్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

నేడు కల్వరి గ్రేస్‌మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధి సాయినగర్‌లోని గుట్టపై ఉన్న సీజీఎం ప్రార్థన మందిరంలో ఈనెల 26న కల్వరి గ్రేస్‌మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కుటుంబ క్షేమాభివృద్ధి ప్రార్థన నిర్వహిస్తున్నట్లు సీజీఎం చర్చి పాస్టర్ ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రార్థనలు కొనసాగుతాయని తెలిపారు. కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి అన్నారు. కావ్య అవెన్యూ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం కార్పొరేటర్‌ను కలిసి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా నూతన పనులను చేపట్టాలని కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను మొదలుపెడతామని.. కాలనీవాసులకు ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు విజయ్, ప్రసన్న బాబు, భరత్, మురళి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

కార్మికుల సంక్షేమమే పరమావధి

టీఆర్ఎస్‌కేవీ నేత మదన్‌గౌడ్



బాధిత కుటుంబానికి నష్టపరిహారాన్ని అందజేస్తున్న మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికుల న్యాయపరమైన హక్కుల కోసం ఎంత వరకైనా పోరాడతాడమని.. కార్మికుల సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నానని టీఆర్ఎస్‌కేవీ నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని జీఆర్‌కే పవర్ కంపెనీలో మహదేవన్ ఎంటర్‌ప్రైజెస్‌లో దామోదర్ అనే కార్మికుడు రెండేళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కాగా 2022 మే 20వ తేదీన జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో యాజమాన్యం అతడిని చికిత్స కోసం గాంధీ ఆస్పత్రిలో చేర్పించి చేతులు దులుపుకుంది. ట్రీట్‌మెంట్ పూర్తయిన 5నెలల తరువాత దామోదర్ కంపెనీకి వస్తే యాజమాన్యం స్పందించలేదు.

◆ దీంతో బాధితుడు టీఆర్ఎస్‌కేవీ నేతను ఆశ్రయించగా జీ.ఆర్.కె. కంపెనీలో సేఫ్టీపై యాజమాన్యాన్ని నిలదీశారు. అదే విధంగా దామోదర్‌కు న్యాయం చేయాలని కోరారు. ఎట్టకేలకు దిగొచ్చిన యాజమాన్యం రూ.2 లక్షల నష్ట పరిహారం ఇచ్చేందుకు అంగీకరించింది. సదరు మొత్తాన్ని బుధవారం షాపూర్‌నగర్‌లోని తన కార్యాలయంలో మదన్‌గౌడ్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు రాంబాబు, కిరణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో మెరుగైన వసతులు కల్పిస్తాం



దుండిగల్ 5వ వార్డులో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ కృష్ణవేణి

దుండిగల్: దుండిగల్ 5వ వార్డులో రూ.15లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను బుధవారం దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి ప్రారంభించారు. అన్ని వార్డుల్లో మెరుగైన వసతులు కల్పించే దిశగా కార్యాచరణ రూపొందించుకుని వెళ్తున్నామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ, వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు అమరం గోపాల్‌రెడ్డి, జక్కుల విజయ, భారత్ కుమార్, రెవెన్యూ అధికారి శ్రీహరిరాజు, మేనేజర్ సునంద, ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

◆ కంటి వెలుగు దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. దుండిగల్ వార్డులో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజల కంటి సమస్యలను దూరం చేసేందుకే సీఎం కేసీఆర్ కంటి వెలుగును ప్రవేశపెట్టారని ఆమె పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

ఓటు.. రాజ్యాంగం ప్రసాదించిన హక్కు

ఎన్నికల అధికారి మంగతాయారు



ఓటర్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఉపకమిషనర్లు మంగతాయారు, ప్రశాంతి తదితరులు


కుత్బుల్లాపూర్: రాజ్యాంగ ప్రసాదించిన ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని ఎన్నికల అధికారి, కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్ మంగతాయారు అన్నారు. బుధవారం 13వ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతల్ రాయల్ డిగ్రీ కళాశాల నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఓటు హక్కును దుర్వినియోగం చేయకుండా సజావుగా వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన చందన, విశాల్, రబియా, లక్ష్మి, దుర్గాభవాని, తేజస్వినిలకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం ఉపకమిషనర్ ప్రశాంతి, తహసీల్దార్ సంజీవరావు, ఏఎంసీలు వెంకటేష్, కె.శ్రీనివాస్‌రావు, పి.శ్రీనివాస్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల సుపరింటెండెంట్ ఆర్.గిరిబాబు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో...

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నేషనల్ ఓటర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణరావు, గండిమైసమ్మ తహసీల్దార్ పద్మప్రియల ఆధ్వర్యంలో మున్సిపల్, రెవెన్యూ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేయించుకోవాలని కోరారు.

కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో..

కుత్బుల్లాపూర్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటర్లు ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని రాజ్యాంగం ప్రసాదించిన హక్కుకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, డీఈఈ చిరంజీవులు, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



మున్సిపల్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న చైర్మన్ శ్రీశైలంయాదవ్



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ సత్యనారాయణరావు, తహసీల్దార్ పద్మప్రియ